క్లుప్తంగా

1వ తరగతి నుంచి ప్రవేశాలు ఉచితం

పొన్నూరు: విద్యా హక్కు చట్టం ప్రకారం మండలంలోని పేద పిల్లలకు ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ప్రవేశాలు ఉచితమని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం ఈ పథకానికి సంబంధించి ఎంఈఓ కార్యాలయంలో ఫ్లెక్సీ ఆవిష్కరించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. ఈ నెల 28వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆర్థికంగా వెనకబడిన వారు అర్హులని, వార్షిక ఆదాయం గ్రామాల్లో రూ.1.20 లక్షలు, పట్టణంలో రూ.1.44 లక్షలని పేర్కొన్నారు. ధృవీకరణకు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు ఉపయోగించి ఆన్‌లైనులో దరఖాస్తు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించండి

గుంటూరు రూరల్: పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య ఆధ్వర్యంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులుకు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సమాఖ్య ప్రతినిధులు వినతి పత్రాన్ని అందిస్తూ రాష్ట్రంలో పంచాయతీ కార్యదర్శులు ప్రస్తుతం తీవ్రమైన పని ఒత్తిడి, ప్రమోషన్స్, పంచాయతీల రీ గ్రూపింగ్ (గ్రేడ్స్ కుదింపు)తదితర సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలు విన్న ఎమ్మెల్యే ప్రభుత్వానికి విన్నవించి పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్, ప్రధాన కార్యదర్శి బందెల రమేష్, కార్యవర్గ సభ్యులు కొక్కె నాగరాజు, అశోక్ కుమార్, నాగరాజు, శ్రీనివాస్, మల్లికార్జున, లెనిన్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సీఐగా వీరా నాయక్



పొన్నూరు: పట్టణ సీఐగా వీరా నాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నగరంపాలెం స్టేషన్లో సీఐగా పని చేసి బదిలీపై పొన్నూరుకు వచ్చారు. ఇక్కడ పని చేసిన సీఐ రవికిరణ్ ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేసినట్లు తెలిసింది. పొన్నూరు పట్టణ సీఐగా పనిచేసిన రవికిరణ్ ఏడు నెలల్లోనే బదిలీ కావడం పట్టణంలో చర్చనీయాంశమయ్యింది.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

గుంటూరు రూరల్: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను అందజేయాలని మండల అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఐదేళ్లల్లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎటువంటి రుణాలు పొందని వారు, దారిద్ర్యరేఖకు దిగువనున్న అభ్యర్థులు మే 10వ తేదీ వరకూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. మండల పరిధిలోని 21 నుంచి 50 ఏళ్ల వయస్సు గల అభ్యర్థులు తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు, కుల ధృవపత్రాలు, విద్యార్హతలతో మీసేవా కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలి

పెదకాకాని: రైతులు మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవడం ద్వారా భూమి స్వభావం తెలుసుకుని ఎరువులు అవసరం మేరకు వాడుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి అన్నారు. మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన రైతులు గ్రామంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని కోరారు. మట్టి నమూనా పరీక్షలు చేయించుకునే రైతులు ఆధార్ కార్డు నెంబరు, పొలానికి సంబంధించిన వివరాలు వెంట తీసుకురావాలన్నారు. వెనిగండ్ల గ్రామంలో శనివారం నుంచి నాలుగు రోజుల పాటు ఉచితంగా నిర్వహించే ఈ మట్టి నమూనా పరీక్షలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ వి.ఎ.ఎ పవన్‌కుమార్ కోరారు.

ఏపీ అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపిక



గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్ జిల్లా బీచ్ కబడ్డీ పోటీలకు తమ కళాశాల విద్యార్థిని ఎంపిక కావడం సంతోషకరమని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక అన్నారు. శుక్రవారం పెదపలకలూరు రోడ్డుని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థిని అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థి షేక్.షాజహాన్‌బి కాకినాడలో మే 2, 3, 4 తేదీల్లో జరిగే 12వ మహిళా, పురుషుల బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపికైందన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ టీపీఎస్ ప్రసన్న, పీడీ సీహెచ్ కిషోర్‌కుమార్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డాక్టర ఎ.హరీష్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

సెలవులిచ్చారు.. పిల్లలు జాగ్రత్త!

- ఈత సరదాలకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్న వైనం
- వేసవి సెలవుల్లో పిల్లలపై నిఘా



పెదకాకాని వద్ద ఉధృతంగా గుంటూరు ఛానల్(కొత్తకాలువ)

పెదకాకాని: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈ నెల 24వ తేదీ నుంచి వేసవి సెలవులు ప్రకటించారు. దీంతో పిల్లల ఆనందాలకు అవధులు లేవు. వేసవి సెలవులు కావడంతో పుస్తకాల బ్యాగులను మూలన పడేసి ఎంచక్కా ఆటల బాట పడుతుంటారు. ఎండల సమయంలో కాలువలను చూడగానే పిల్లల్లో ఉత్సాహం ఉరకలేస్తుంది. ఈ ఆనందాల వెంటే విషాదాలు కూడా దాగి ఉన్నాయి. తమకు ఈత రాదనే విషయం కూడా మరిచి నీటి కుంటలు, చెరువులు, బావులు, కాలువల్లో లోతు తెలియక దిగి ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో మండే ఎండలో చిన్నారులను కంటికి రెప్పలా చూసుకోవాల్సి బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. సరదా ఈతలతో జరిగే ప్రమాదాలపై పిల్లలకు అవగాహన పెంచాలి.

గతంలో జరిగిన ప్రమాదాలు..

మండలంలోని నంబూరు, పెదకాకాని, తక్కెళ్లపాడు, రామచంద్రపాలెం గ్రామాల నుంచి ప్రవహిస్తున్న గుంటూరు ఛానల్(కొత్తకాలువ) ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ కాలువలోనే నంబూరు వద్ద ఈ ఏడాది మార్చి 7న దాసరి జాషువ(13) అనే బాలుడు తన మిత్రులతో కలిసి దిగాడు. కాలువ లోతు ఎక్కువ ఉండడంతో బాలుడు ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. గాలించి బయటకు తీసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ నెల 1వ తేదిన తక్కెళ్లపాడు వద్ద ఈత కొట్టేందుకు దిగిన షేక్ జాని(18) తన మిత్రుల ముందే కాలువలో మునిగిపోయాడు. చుట్టుపక్కల వారికి సైతం ఈత రాకపోవడంతో యువకుడు కన్నవారికి కడుపుకోత మిగిల్చాడు. గతంలోనూ ఇటువంటి ప్రమాదాలు కోకొల్లలు. గ్రామ శివారుల్లో బావులు, చెరువులు, కాలువలు, కుంటలు ఉంటే పిల్లలను అటుగా వెళ్లకుండా జాగ్రత్తలు పడాలి. ఒకవేళ సరదాగా ఈత నేర్చుకునేందుకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా తగిన ఏర్పాట్లతో పెద్దలు సైతం పక్కన ఉండేలా చూసుకోవాలి.

ఎలక్ట్రానిక్ వస్తువులతోనూ ముప్పే..

వేసవి సెలవులు కావడంతో పిల్లలు భోజనం తరువాత ఎండలో తిరగకుండా పడుకునేలా చూడాలి.



నంబూరు వద్ద గల్లంతయిన వారి కోసం గాలిస్తున్న దృశ్యం(ఫైల్ ఫొటో)

ఆ తరువాత ఇంటి పరిసరాల్లో, చెట్ల నీడలో ఆడుకునేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి. పాత కాలంలో ఆడుకునే ఆటలను పిల్లలకు తెలియజేసి ఆసక్తి కలిగించాలి. అలా కాకుండా ఇంట్లో నిత్యం టీవీ, కంప్యూటర్, సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లు, వీడియో గేమ్‌లు వంటివి అలవాటు చేస్తే పిల్లల్లో దృష్టి లోపం తలెత్తే అవకాశం ఉందని నేత్ర వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

అవగాహన కల్పించాలి..

తల్లిదండ్రులు పిల్లల కోసం అధిక సమయం కేటాయించాలి. ఖాళీ సమయాల్లో పిల్లలు విజ్ఞాన, వినోదానికి సంబంధించిన పుస్తకాలు చదివేలా అలవాటు చేయాలి. ఇంటిలోనే ఉంటూ నీడ పాటున ఆటలు ఆడుకునేలా చూడాలి. పిల్లలు ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు కచ్చితంగా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి బయటకు వెళ్లేలా వారికి అవగాహన కల్పించాలి.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో పాల్గొనండి



సంఘీభావం తెలియజేస్తున్న నాయకులు

తెనాలిఅర్బన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని జూన్ మొదటి వారంలో విజయవాడలో నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తెనాలి తాలూకా యూనిట్ కార్యవర్గ సమావేశాన్ని జిల్లా వైద్యశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని ఆయన కోరా రు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమ బద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఉద్యోగులు, విశ్రాంత, కాంట్రాక్ట్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు పోతురాజు, నాగేశ్వరరావు, తెనాలి యూనిట్ అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సుధీర్‌బాబు, మరియదాసు, విజయ్‌కుమార్, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ‘మీకోసం మేము’



మాట్లాడుతున్న డాక్టర్ యశస్వి రమణ, డాక్టర్ బిందు నర్మద, డాక్టర్ భార్గవి తదితరులు

గుంటూరు మెడికల్: స్థానిక జీజీహెచ్‌లో ప్రతిష్ఠాత్మకంగా మీ కోసం మేము డాక్టర్ పేషెంట్ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ ప్రతి శుక్రవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆస్పత్రిలో ఉన్న రోగుల సహాయకులకు ఇంటర్నేషనల్ స్ట్రోక్ డే సందర్భంగా చెక్ బీపీ– స్టాప్ స్ట్రోక్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ బీపీని చెకప్ చేసుకోవడం గురించి వివరించారు. ఆహారపు అలవాట్లు, జీవన విధానం వలన బ్రెయిన్ స్ట్రోక్ రావడం చాలా సహజంగా మారిపోయిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా బీపీ చెక్ అప్ చేయించుకోవాలని కోరారు. బీపీ ఉన్నట్లు నిర్ధారణ అయితే తప్పనిసరిగా వైద్యులు సూచించిన మందులు నిరంతరం వాడాలని పేర్కొన్నారు. డాక్టర్ బిందు నర్మదా, డాక్టర్ భార్గవి ప్రజలకు అవగాహన కల్పించారు. వందమంది రోగుల సహాయకులు వారికి ఉన్న అనుమానాలు వైద్యులు నివృత్తి చేశారు.

కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు




ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు టెండర్ పొందిన కాంట్రాక్టర్లు తప్పనిరిగా నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కొరిటెపాడు, పెద్దపలకలూరు రోడ్, ఉద్యోగ నగర్, జేకేసీ నగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. నాణ్యతపై ఫిర్యాదులు వస్తే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. సీసీ రోడ్ల ఏర్పాటుకు ముందే తప్పనిసరిగా డ్రెయిన్ నిర్మాణం చేయాలని పేర్కొన్నారు. సచివాలయాల వారీగా ఎమినిటి కార్యదర్శులు తాగునీటి సరఫరా సమయాల్లో శాంపిల్స్ సేకరించాలని, కలుషిత నీటి సరఫరా గుర్తిస్తే తక్షణం తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో డీఈఈలు రమేష్ బాబు, శ్రీనివాస్, ఎస్ఎస్ సోమశేఖర్ పాల్గొన్నారు.

మే 1 నుంచి సమ్మర్ క్యాంప్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఆసక్తి కల్గిన 14 ఏళ్లలోపు బాలబాలికలు స్టేడియం, స్విమ్మింగ్ పూల్‌లో శనివారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మే 1వ తేదీ నుంచి 31 వరకు క్యాంప్ ఉంటుందని చెప్పారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు క్యాంప్ జరుగుతుందన్నారు. క్యాంప్‌లో అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, స్కేటింగ్, టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా ధ్యానం, టేబుల్ టెన్నిస్, స్విమ్మింగ్ అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు. నెల రోజుల శిక్షణ అనంతరం జరిగే క్యాంప్ ముగింపు కార్యక్రమంలో ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లు, బహుమతులు అందిజేయనున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత శిక్షణ తరగతులు వినియోగించుకోవాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న జూపూడి రంగరాజు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మే 14 నుంచి జూన్ ఏడో తేదీ వరకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు జూపూడి రంగరాజు తెలిపారు. శుక్రవారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శిక్షణ తరగతుల పోస్టర్లు విడుదల చేశారు. రంగరాజు మాట్లాడుతూ.. హిందూ బంధువులకు భగవద్గీత, మార్షల్ ఆర్ట్స్, స్వీట్స్, ఫాస్ట్ ఫుడ్, కర్ణాటక శాస్త్రీయ సంగీతం, మగ్గం వర్క్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ అంశాల్లో బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నామని, శిక్షనా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంబంధించిన దరఖాస్తులు బ్రాడీపేట 3/10 లోని ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్మెంట్ సొసైటీ కార్యాలయంలో లభిస్తాయని, ఇర వివరాలకు 99491 48006 నంబరులో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజర్ గాయత్రి బెహరా, బీజేపీ రాష్ట్ర నాయకులు కొత్తూరు సుబ్బారావు, వనమా నరేంద్ర కుమార్, డాక్టర్ నిరంజన్, తుపాటి చిన్నికృష్ణ, సాయి, హైందవ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ బెహరా, జిల్లా అధ్యక్షుడు శంకర్ యాదవ్, హిందూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.సీతారామయ్య, మహాదేవ హిందూ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కడియాల గోపి పాల్గొన్నారు.

హైర్ బస్ డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె రూరల్: హైర్ బస్సు డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ కోరారు. మదర్ థెరిస్సా హైర్ బస్ డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం డిపో మేనేజర్ సునీల్ కుమార్‌కు వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. హైర్ బస్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించేలా ఐడీ కార్డులు, పీఎఫ్, ఈఎస్ఐను అమలు చేయాలన్నారు.

సర్వేలను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించండి

నెహ్రూనగర్: సర్వేల పేరిట సచివాలయ ఉద్యోగులను గత 8 నెలల నుంచి తీవ్ర పని ఒత్తిడికి గురి చేస్తున్నారు.. సర్వేల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్లో అవగాహనా కల్పించకపోవడం వలన అనేక చోట్లా ప్రజలు ఉద్యోగులకు సహకరించకపోగా అవమానకర రీతిలో మట్లాడుతున్నారని సర్వేలను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇచ్చిన సర్వేలు పూర్తి చేయాలని సెలవురోజుల్లో విధులు నిర్వహించాలని అధికారులు సచివాలయ ఉద్యోగులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆరోపించారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తుందని ఆశ పడ్డ ఉద్యోగులకు తీవ్ర నిరాశే మిగిల్చిందన్నారు. ఉద్యోగులను మాతృ శాఖలో విలీనం చేసి, అవకాశం మేరకు సచివాలయ ఉద్యోగులను వివిధ శాఖల్లో విలీనం చేయాలన్నారు.

జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలోని కీట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు డీడీయూ జీకేవై కార్యక్రమం ద్వారా జూనియర్ సాఫ్ట్ వేర్ వెబ్ డెవలపర్ (జేఎస్డీ) కోర్సులో ఆరు నెలలపాటు ఉచిత శిక్షణతోపాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి విద్యార్థికి జూనియర్ సాఫ్ట్ వేర్ డెవలపర్ కోర్సులో సాఫ్ట్‌వేర్ డెవలపర్, సీసీ ప్లస్ ప్లస్, జావా స్క్రిప్ట్, పైథాన్, వెబ్ డిజానింగ్ కోర్సులతోపాటు స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్స్, లైఫ్ స్కిల్స్ నందు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని తెలిపారు. కంప్యూటర్ బ్యాక్ గ్రౌండ్‌తో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కోర్సులు పాస్, ఫెయిల్ అయిన 20 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణానంతరం ప్రతి విద్యార్థికి ప్రభుత్వ గుర్తింపుతో సర్టిఫికేట్ అందించి, వివిధ సంస్థల్లో నూరు శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని సూచించారు. ఈనెల 28వ తేదీన బ్యాచ్ ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

ఇక ఐదు రోజులే గడువు..

ఐదు శాతం రాయితీకి అవకాశం

నెహ్రూనగర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025–26) సంబంధించిన ఆస్తి పన్ను ముందస్తుగా ఏప్రిల్ నెలాఖరులోగా ఏక మొత్తంగా చెల్లించే వారికి మొత్తం పన్నుపై ఐదు శాతం రాయితీ లభిస్తుందని, ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఒకేసారి ఏక మొత్తంగా చెల్లిస్తే వారికి వడ్డీపై 50 శాతం రాయితీని కూడా ఈ నెలాఖరులోపు చెల్లించి పొందవచ్చని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్నును ముందస్తుగా ఏక మొత్తంగా చెల్లించే వారికి 5 శాతం రాయితీ అవకాశాన్ని కల్పించిందని, ఈ నెల 30లోగా ఆస్తి పన్నుని ఏక మొత్తంగా చెల్లిస్తే పన్ను రాయితీ లభిస్తుందన్నారు. ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిలను ఒకేసారి ఏక మొత్తంగా చెల్లించే వారికి వడ్డీపై 50 శాతం రాయితీని కూడా ఈ నెలాఖరులోపు చెల్లించి పొందవచ్చన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో 8, సర్కిల్ కార్యాలయంలోని 6 ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు ప్రతి రోజు ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేసేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న కిట్స్ కళాశాల ఛైర్మన్ సుబ్బారావు

ప్రత్తిపాడు: విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని కిట్స్ కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. ‘ప్రపంచ మేథో సంపత్తి దినోత్సవం’ సందర్భంగా ఈ నెల 24వ తేదీన ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ఇన్నోవేషన్ విభాగం, ఏపీ ఉన్నత విద్యామండలి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ రూసా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఏఎన్‌యూలో నిర్వహించిన నూతన ఆవిష్కరణల పోటీల్లో కిట్స్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా 250 ఆవిష్కరణలు పోటీల్లో పాల్గొనగా, 10 ఆవిష్కరణలు మాత్రమే తుది ఎంపికకు అర్హత సాధించాయి. వాటిలో కిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల రూపొందించిన హైబ్రిడ్ డ్రోన్ ఆవిష్కరణ మొదటి బహుమతిని సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డా.పి.బాబు, అకాడమిక్ డైరెక్టర్ డా.కె.హరిబాబు, సీఎస్సీ విభాగాధిపతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు పీఎమ్‌డీఎస్ విత్తనాల పంపిణీ

గుంటూరు రూరల్: రైతులకు 30 రకాల పీఎమ్‌డీఎస్ విత్తనాల ప్యాకెట్‌లను అందించినట్లు వ్యవసాయ డీపీఎం రాజకుమారి తెలిపారు. శుక్రవారం వట్టిచెరుకూరు మండలం వల్లూరు గ్రామంలో క్షేత్రస్థాయి సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని రైతులతో మాట్లాడారు. గత 5 ఏళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు 30 రకాల విత్తనాలతో కూడిన పీఎమ్‌డీఎస్ విత్తనాల ప్యాకెట్‌లను అందజేశారు. ఈ పీఎమ్‌డీఎస్ విత్తుకోవటంతో అధిక వర్షాలకు కూడా ఎటువంటి పంట నష్టం జరగదని.. కలుపు, చీడపీడలు తగ్గుతాయని అన్నారు. రసాయన ఎరువులు వినియోగించే రైతులు కూడా పీఎమ్‌డీఎస్ విత్తుకోవటం ద్వారా ఎరువుల మోతాదు తగ్గించుకుని, ఖర్చును, భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పహల్గాం ఉగ్రదాడికి నిరసన



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: పహల్గాం ఉగ్రదాడి తీవ్ర విషాద సంఘటనని ఆర్.వి.ఆర్.జె.సి ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు అన్నారు. పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం చౌడవరంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ప్రశాంత పర్యాటక ప్రాంతంలో ఇలాంటి దాడులు రాక్షస చర్యలకు నిదర్శనమని కళాశాల కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు అన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎన్‌సీసీ క్యాడెట్స్ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీలు



ర్యాలీలో పాల్గొన్న మలేరియా విభాగం సిబ్బంది

పొన్నూరు: ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యకరమైన జీవనం ఏర్పడుతోందని ఇన్‌చార్జి మలేరియా అధికారి కె.హరిబాబు అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా పొన్నూరు మలేరియా విభాగం ఆధ్వర్యంలో పట్టణంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్.షారూన్, ఎంపీహెచ్ఈఓ పూర్ణచంద్రరావు, కోటేశ్వరరావు, ఏఎన్‌యంలు, ఆశా వర్కర్లు, యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మలేరియా అంతం మనతోనే సాధ్యమని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మేరియునిస్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని గొట్టిపాడులో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. అందరూ కలిసి మలేరియాపై పోరాటం చేస్తే వ్యాధి జాడలు కనుమరుగవుతాయని వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో చెల్లమ్మ, పీహెచ్ఎన్ డి.నిర్మల, సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి, ఏఎన్ఎం ఎం.కళావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం పెదనందిపాడులో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో ఎస్ఆర్ ప్రసాదస్వామి, హెచ్ఈ ఎస్.కె.సుజ, ఎంపీహెచ్ఎస్‌లు చెన్నయ్య, పి.అరుంధతి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

‘హెల్త్ ఆన్ వీల్స్’ ప్రాజెక్టు ఆరంభం

ప్రారంభించిన సబ్‌కలెక్టర్ సంజనా సింహ



హెల్త్ ఆన్ వీల్స్ వాహనంతో సంజనా సింహ, డాక్టర్ శారద ప్రభృతులు

తెనాలి: పట్టణానికి చెందిన డీ3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ‘హెల్త్ ఆన్ వీల్స్’ ధర్మ వాహనాన్ని శుక్రవారం సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ వాహనంతో 24 గంటలు ఫస్ట్‌ఎయిడ్, గుండెపోటు సంబంధిత సేవలను అందిస్తారు. వీటితోపాటు మహిళల్లో క్యాన్సర్ స్క్రీనింగ్, హెచ్‌పీవీ వ్యాక్సిన్, పాప్‌స్మియర్ పరీక్ష వంటి సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద వెల్లడించారు. వీటితోపాటు హెల్త్ ఎడ్యుకేషన్, డైట్, న్యూట్రిషన్, ఒబెసిటీ అంశాలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. ఎన్‌సీడీఎస్ వ్యాధులను ముందుగానే గుర్తించి, నివారణకు కృషిచేయాలనేది లక్ష్యంగా వివరించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో వివిధ యూనియన్లకు చెందిన ఉపాధ్యాయులు డీవీ సుబ్బారావు, రామచంద్ర, ఎస్.రవికుమార్, ప్రసాద్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ఉమామహేశ్వరరావు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, అనూరాధ పాల్గొన్నారు.

శాంతిభద్రతల విఘాతకులను దీటుగా ఎదుర్కొందాం



మసీదు వద్ద నల్లజెండాలతో నిరసన తెలుపుతున్న మసీదు పెద్దలు

తెనాలిటౌన్: శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ప్రజాస్వామ్యయుతంగా ఎదుర్కొందామని రాష్ట్ర ఇమామే మజ్లిస్ కమిటీ కార్యదర్శి షేక్ ఫరీద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని బీసీ కాలనీ అర్కమ్ మసీద్ వద్ద పహల్గాం ప్రాంతంలో ఉగ్రదాడిలో మరణించిన వ్యక్తులకు ఘన నివాళులర్పించారు.

అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఉగ్రదాడిని కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఖండించాలని మసీదు పెద్దలు ముక్త కంఠంతో నినదించారు. ఉగ్రమూకలను మట్టుపెట్టడంలో భారత సైన్యానికి ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మౌలానా మసూద్ అహ్మద్, షేక్ షబ్బీర్, షేక్ సత్తార్, షేక్ మునీర్, తాజ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.